క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనపర్తి: అనపర్తి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ లైన్, మండలంలోని పీరా రామచంద్రపురం గ్రామ పరిధిలో విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల పనులు నిర్వహిస్తున్న కారణంగా ఈ నెల 19వ తేదీ బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీరా రామచంద్రపురం, దుప్పలపూడి, అనపర్తి పంచాయతీ ఏరియా, కెనాల్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు, బుల్లియ్యగారితోట, షారోనుపురం, రామడమ్మపేట, శేషగిరిరావుపేట, ఫ్లెట్చర్ ఏరియా, ఇందిరానగర్, మార్కండేయపురం తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నందీశ్వరునికి అభిషేకాలు

రంగంపేట: చంద్రేడులో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ సోమవారం తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని నందీశ్వరుని ఆశీస్సులు పొందారన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

రంగంపేట: కె.కోటపాడు గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించడానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ వాకాడ అమ్మాజీకి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అద్దె ఇంటిలో అంగన్‌వాడీ భవనం నిర్వహిస్తున్నారని, కొత్త భవనం కోసం నిధులు మంజూరైనా స్థలం లేకపోవడం సమస్యగా మారిందని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ సోమిశెట్టి వీరబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఆధార్ క్యాంప్

బిక్కవోలు: మండలంలోని పందలపాక సచివాలయాల వద్ద మంగళవారం ఆధార్ క్యాంప్ జరగనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఎంపీవీఎస్ఎస్ ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి కూలీకి పాముకాటు

సీతానగరం: రఘుదేవపురానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీ కె.సుబ్బలక్ష్మి పాముకాటుకు గురైంది. ఏపీవో నాగేషవేణి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రఘుదేవపురం శివారున ఉపాధి పనికి వెళ్లిన సుబ్బలక్ష్మిని పాము కరిచింది. వెంటనే ఆమెను సీతానగరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి చికిత్స అనంతరం సీతానగరం బస్టాండ్ సెంటర్ వద్దగల ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఎటువంటి ప్రమాదం లేదని చెప్పడంతో ఇంటికి తరలించారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాలి

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో మంగళవారం ప్రజలకు సరఫరా చేసే వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. ఆయన సోమవారం మండల పరిషత్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శులకు జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామాన పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా రక్షిత తాగునీటి పథకాలు శుభ్రం చేయించాలని ఆదేశించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈబీసీ నేస్తంపై అవగాహన

బిక్కవోలు: మండలంలోని రంగాపురంలో ఈబీసీ నేస్తంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి పోతల ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అగ్రకులాల్లో ఆర్థికంగా వెనకబడిన మహిళలకు భరోసా అందించడానికి ఈబీసీ నేస్తం ద్వారా ఏడాదికి రూ.15 వేలు అందిస్తున్నారన్నారు. రంగాపురంలో 30 మంది లబ్ధిదారులకు రూ.15 వేలు చొప్పున జమచేశారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, మండల జేఏస్‌సీ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, కనుమూరి వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



పసిబిడ్డను చూపుతున్న ఈఎంటీ దేవి

అనపర్తి: బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన నల్లబోతుల దుర్గ సోమవారం 108 అంబులెన్స్‌లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. నల్లబోతుల దుర్గకు పురిటి నొప్పులు రావడంతో కాపవరానికి చెందిన ఆశ వర్కర్ నీలిమ 108కు సమాచారమిచ్చారు. 108 సిబ్బంది దుర్గను అంబులెన్స్‌లో ఎక్కించుకుని అనపర్తి ఏరియా ఆసుపత్రికి బయలు దేరారు. అయితే దుర్గకు ప్రసవ వేదన ఎక్కువవ్వడంతో అంబులెన్స్‌లో ఈఎంటీ దేవి, పైలెట్ ఆదినారాయణలు ఆమెకు ప్రసవం చేసి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది తెలిపారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- పాల దిగుబడిపైనా తీవ్ర ప్రభావం
- పాడి సంరక్షణ చర్యలు తప్పనిసరి



అనపర్తి: వేసవి ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే సుమారు 5 నుంచి 10 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పశువులు వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంటుంది. అందుకే వేసవిలో పాడి పశువుల సంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని హెచ్చరిస్తున్నారు. పశువులు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అనపర్తి ఏడీఏ వై.శ్రీనివాసరావు వివరించారు.

వడదెబ్బ తగిలిన పశువుల లక్షణాలు

సాధారణంగా పశువుల శరీర ఉష్ణోగ్రత 99 నుండి 100 డిగ్రీల వరకు ఉంటుంది. అయితే వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నపుడు పశువుల శరీర ప్రక్రియ మందగించి వాటి శరీర ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయి. ఆవులతో పోల్చితే గేదెలు అధిక వేడిని భరించలేవు. గేదెలు ఎక్కువ ఉష్ణాన్ని గ్రహించి తక్కువ ఉష్ణాన్ని విసర్జించడం వల్ల తరచుగా గేదెలు వడదెబ్బకు లోనయ్యే అవకాశం ఉంటుంది. వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల నుంచి 105 డిగ్రీల వరకూ పెరుగుతుంది. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. శ్వాస క్రియ ఎక్కువై గుండె, నాడీ వేగం పెరిగి పశువులు రొప్పుతూ ఉంటాయి. కొన్ని పశువులు కిందపడి కొట్టుకుని అపస్మారక స్థితికి చేరుకుంటాయి. వడదెబ్బ ప్రభావంతో పశువుల్లో పాల దిగుబడి తగ్గిపోతుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులకు వడదెబ్బ తగలకుండా రైతులు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకుని వాటిని సంరక్షించాలి. ముఖ్యంగా చల్లగా ఉండే ప్రదేశాల్లో పశువులను ఉంచాలి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పశువులను బయట మేత కోసం వదలకూడదు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తరువాత మాత్రమే పశువులను బయటకు వదలాలి. పశువులకు నీళ్లు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాటు చేయాలి. పోషకాహార లోపం రాకుండా సమీకృత దాణాను అందించాలి. దీంతో పాల దిగుబడి తగ్గకుండా, పశువులు అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ముఖ్యంగా పశువుల డైరీ ఫారాల్లో మధ్యాహ్న సమయంలో స్ప్రింక్లర్స్‌ను వినియోగించి చల్లని వాతావరణాన్ని కల్పించాలి.

అనపర్తి నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు
అనపర్తి	1,256	8,644
బిక్కవోలు	1,203	5,798
రంగంపేట	7,623	11,045
పెదపూడి	2,160	10,445

చల్లని ప్రదేశంలో ఉంచాలి



పశువు వడదెబ్బకు గురైందని గుర్తించిన వెంటనే రైతులు పశువులను చల్లటి నీటితో కడిగి, చల్లని గాలి వీచే ప్రదేశానికి మార్చాలి. పశువుల శరీర ఉష్ణోగ్రతను గమనించి ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరే వరకు పలుమార్లు నీటితో కడగాలి. వెంటనే సమీపంలోని పశువైద్యాధికారిని సంప్రదించి తగిత చికిత్స చేయించాలి.

– డాక్టర్ వై.శ్రీనివాసరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, అనపర్తి

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ



గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి

అనపర్తి: ముందస్తు జాగ్రత్తలతో అగ్నిప్రమాదాలు నివారించొచ్చని అనపర్తి అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు సోమవారం స్థానిక ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదాలు, నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు మంటలు చెలరేగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ అధికారులు, ఉద్యోగులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర పనులకు అనుమతులివ్వండి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- అమరావతిలో మంత్రి, అధికారులకు వినతి



అమరావతిలో ఉన్నతాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని సంబంధితశాఖ మంత్రి, అధికారులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కోరారు. రూ.85.17 కోట్లతో కూడిన ఆరు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సమర్పించారు. భారీ వర్షాల సమయంలో ఏర్పడే ముంపుతో పాటు వరదల నుంచి పంటపొలాలను కాపాడుకోవడానికి ఈ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనితకు వివరించారు. అనంతరం ఆ శాఖ ఎండీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కలుసుకుని గోదావరి వరదలతోపాటు కాలువలు, చెరువుల్లోని ముంపునీటి ప్రవాహాల కారణంగా నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, కలుగుతున్న నష్టాలను తెలియజేశారు. సీతానగరం మండలం బొబ్బిలంక వద్ద ఏజీఎల్‌బీ ఏటిగట్టుపై 18,400 కి.మీ.వద్ద ఉన్న అవుట్ ఫాల్ స్లూయిజ్‌ని ఆధునీకరించాలన్నారు. బొబ్బిలంక – జాలిమూడి నడుమ అఖండ గోదావరి ఏటిపట్టుపై 19.00 కి.మీ నుంచి 20.60 కి.మీ నడుమ కోతకు గురవుతున్న ప్రాంతాలలో రాళ్లతో రక్షణ ప్లాట్‌ఫాం నిర్మాణాన్ని అత్యవసరంగా చేపట్టాలన్నారు. మునికూడలిలో గోదావరి ఎడమగట్టుపై 22.400 కి.మీ నుంచి 23.400 కి.మీ వరకు కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ ప్లాట్‌ఫాం నిర్మించాలన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలోని బురద కాలువ నుంచి రాజు సప్లయ్ చానల్‌కు అత్యవసరంగా రక్షణ పనులు చేపట్టాలని కోరారు. ఏటా జూలై –నవంబర్ మాసాల నడుమ బురద కాలువకు వచ్చే వరదతో శ్రీరంగపట్నం ముంపు బారిన పడుతోందన్నారు. మునగాలలో బుద్దాయి కాలవ (నాగబుచ్చన్న ట్యాంకు సర్‌ప్లస్ ఛానల్)కు అత్యవసర పనులు చేపట్టాలన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులోని శిలారామయ్య చెరువు, ఈడిమండలం చెరువు, ఎర్రపరిమిగొయ్యి చెరువులకు శాశ్వత కల్వర్టులను నిర్మించాలన్నారు. దీనివల్ల 300 ఎకరాలను ముంపుబారి నుంచి కాపాడవచ్చన్నారు. వీటితోపాటు ఇనగంటివారిపేటలో రూ.70 లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణంతోపాటు రూరల్ మండల పరిధిలోని పొట్టిలంక వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు చేశారు.

పేదల గుండె చప్పుడు ముఖ్యమంత్రి జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేద ప్రజల గుండె చప్పుడు సీఎం జగన్ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే, ఆయన సతీమణి ఆదిలక్ష్మి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108, అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, రైతు భరోసా, పేదలందరికి ఇళ్లు తదితర సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్ ప్రజల హృదయాల్లో దేవుడులా కొలువయ్యాడన్నారు. కార్యక్రమంలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళదీప్తి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, సర్పంచ్ వుండ్రు చంద్రకళ, అనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్న బాబు, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

45 ఏళ్ల సీలింగ్ భూముల కల నేర్చిన ఎమ్మెల్యే

గ్రామంలో 45 ఏళ్లుగా సీలింగ్ భూములు కోల్పోయిన నిరుపేదలకు మళ్లీ త్వరలో వారి పేర్లతోనే హక్కులు ఇప్పించడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో 45 మంది ఎస్సీ, బీసీలకు సంబంధించిన 23 ఎకరాల సీలింగ్ భూములు 45 ఏళ్ల క్రితం కొంత మంది భూస్వాములు అన్యాక్రాంతం చేశారన్నారు. వారంతా తమ భూములు ఇప్పించాలని పలుమార్లు విన్నవించిన నేపథ్యంలో ఉన్నత అధికారులతో మాట్లాడి వారికి భూములు ఇప్పించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశానన్నారు. బాధితుడు రాజు మాట్లాడుతూ తమ భూములు ఇప్పిస్తున్న ఎమ్మెల్యేకు జీవితాంతం రుణపడి ఉంటామని, మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

రీ సర్వే వేగవంతం



సరిహద్దు రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న లక్ష్మణరావు

అనపర్తి: భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు జిల్లా సర్వే అధికారి పి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని రామవరం విచ్చేసిన ఆయన గ్రామ పరిధిలో జరుగుతున్న సమగ్ర భూముల సర్వే, సర్వే రాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం ద్వారా చేపడుతున్న భూసర్వేతో రాబోయే తరాలకు భూవివాదాలు లేకుండా ఉంటాయన్నారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసి పాస్ పుస్తకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ చైత్రవర్షిణి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల సర్వేయర్ పి.గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యం



విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంపరలో రూ.4.2 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో సంపర పరిసర గ్రామాలకు విద్యుత్ లోఓల్టేజ్ సమస్య తొలగిపోతుందన్నారు. గ్రామాల్లో వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేసి వాటికి అవసరమైన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు తదితర భవనాలు నిర్మించి గ్రామ స్వరాజ్య సాధనకు కృషి చేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, జేసీఎస్ కన్వీనర్ కర్రి శ్రీవెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే బంగారు భవిష్యత్తు

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగనన్నతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పందలపాకలో నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోఓల్టేజ్ సమస్యల నివారణకు ప్రభుత్వం సబ్‌స్టేషన్‌ల సంఖ్య పెంచడంతో పందలపాక, సంపర గ్రామాలకు సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయన్నారు. గతంలో పందలపాకలోని 16 ఎకరాల కాలనీకి సుమారు రూ. 30 లక్షలతో విద్యుత్ అందించడానికి, తాజాగా పందలపాకలో రూ.2.76 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు విద్యుత్‌శాఖ అధికారులు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఎంపీటీసీలు కర్రి గీతా స్రావితి, మచ్చాపాప, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు



ఉప సర్పంచ్ సురేష్‌ను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మునికూడలికి చెందిన టీడీపీ పంచాయతీ ఉప సర్పంచ్ సురేష్‌తో పాటుగా ఇరవై మంది సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధి రాజంపేట పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ చేరికల కమిటీ నియోజకవర్గం కన్వీనర్ గద్దె వెంకట కృష్ణ చౌదరి (నల్లి), పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, కవల కృష్ణమూర్తి, అంబటి రాజు, కవల దుర్గం, కొల్లి చిరంజీవి, ఆకుల వీరవెంకట సత్యనారాయణ (అబ్బన్న) పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఇనుగంటివారిపేటలోని మదీనా మసీదులో సోమవారం ముస్లింలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముస్లీములతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముస్లీముల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఇనుగంటివారిపేటలో రూ.70 లక్షలతో షాదీఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ -2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, నియోజకవర్గం బూత్ కమిటీల అధ్యక్షుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి, సర్పంచ్ సత్యం రాంపండు, కవల కృష్ణమూర్తి, రంది భారతిదేవి, అంబటి రాజు పాల్గొన్నారు.

భగభగమండే



గోకవరంలో వెలవెలబోతున్న వారపుసంత

గోకవరం: వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో 43 డిగ్రీలకు పైబడి పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వేసవి తాపానికి ఉక్కబోత తోడవడంతో బయట సంచరించే వారితో పాటు ఇళ్లలోని వారు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో సోమవారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఎండ తీవ్రత కొనసాగింది. అధిక ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. మరో రెండు, మూడు రోజుల పాటు పగటి పూట ఉష్ణోగ్రతలు ఇదేవిధంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రంలో జగన్ సుపరిపాలన

సీతానగరం: ప్రజలకు అవసరమైన అన్ని పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని సచివాలయ కన్వీనర్ మట్ట శ్రీనివాస్ అన్నారు. సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీలో సోమవారం ఆయన, గ్రామ కమిటీ అధ్యక్షుడు చీర్ల పోశియ్య, గృహసారథి సంగిశెట్టి కాపు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వాటి ద్వారా ఏ కుటుంబం ఎంత లబ్ధి పొందిందో వివరించారు. బుక్‌లెట్‌లో ఉన్న ప్రశ్నలకు జవాబులు రాబట్టి, మిస్డ్ కాల్ చేశారు. అనంతరం ఇంటి వద్ద, సెల్‌ఫోన్లు మా నమ్మకం నువ్వే జగనన్న స్టికర్లు అతికించారు. కార్యక్రమంలో ఈలి పెద్ద, మరిపాక నాగేశ్వరరావు, కొమ్మిరెడ్డి సత్తియ్య, గృహసారథులు పేపకాయల సుబ్రహ్మణ్యం, తోరం నాగేంద్ర, గ్రామ వలంటీర్లు కనుమూరి త్రిమూర్తులు, చీర్ల మణికంఠ పాల్గొన్నారు.



నాగరత్నం కాలనీలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు

గోకవరం: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. గోకవరం సచివాలయం -4 పరిధిలోనూ, వెదురుపాకలో సోమవారం సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, బిజ్జి రాజు, బివి చంద్రం, మచ్చా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన

బిక్కవోలు: దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ జంగావీర వెంకట సుబ్బారెడ్డి అన్నారు. బిక్కవోలులో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరించారు. ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తీసుకుని వారి అనుమతిలో ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరెళ్ళ సుమలత, ఉప సర్పంచ్ జంగా మురళీకృష్ణారెడ్డి, తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాలను అందజేస్తున్న వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి

ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి

అనపర్తి: రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పులుగుర్తలో బుల్లిరెడ్డి పాల్గొని రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోకవరంలో జగనన్నే మా భవిష్యత్ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

'జగనన్నే మా భవిష్యత్తు'కు మంచి స్పందన

మధురపూడి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కోరుకొండ, బూరుగుపూడి, కోటి, గాదరాడ గ్రామాల్లో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. కోరుకొండలోని బీసీ కాలనీ, అగ్రహారం, సాయిబాబాగుడి వీధుల్లో 80 గడపలు తిరిగి ప్రభుత్వ పథకాలపై గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అయిల రామకృష్ణ, పసుపులేటి బుల్లియ్యనాయుడు, బొండాడ చందు, కోడూరి సత్తిరెడ్డి, వ్యవసాయ సలహామండలి జిల్లాకమిటీ సభ్యుడు కంటే వినయ్‌తేజ పాల్గొన్నారు.